# ఆ (హా)ర్టిస్ట్

సంవత్సరంలో కనీసం పదిరోజులైనా సొంత ఊళ్ళోగడపాలన్న నా నిర్ణయం గత పదేళ్ళుగా క్రమం తప్పకుండా అమలుకావడం నా అదృష్టం. అఫ్‌కోర్స్ సంకల్పబలం కూడా దీనికి తోడుగావచ్చు.

రద్దీ తక్కువగానే ఉంది. బస్సులో లేడీస్ రోలో మూడో సీట్‌లో సెటిలయ్యాం నేనూ, మా ఆవిడా.

"రైట్! రైట్!"

కండక్టరిచ్చిన హుషారైన ఊపుతో రాజహంసలా కదిలింది బస్సు - మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుండి. ఎప్పటిలాగానే నేను నా ఆలోచనా సరోవరంలో ఈదడం మొదలెట్టాను.

"టికెట్ ప్లీజ్!"

వాస్తవంలోకి వచ్చిపడేలా చేశాడు కండక్టరు. తన సీటులో నుండే (మా పక్కనే ఉంది కదా!) అడుగుతున్నాడు.

"వికారాబాద్ రెండు; .... ఒకటి క్యాట్ ...." అన్నాను.

బాగా అనుభవమున్న ఎకౌంటెంట్‌లా నోటితో కాలికులేటు చేస్తూ, ఠక్కున రెండు టిక్కెట్లు చించి, పంచ్ చేసిచ్చాడు.

"పైన ఇంకా ఎంతివ్వాలి?" యాభై నోటిచ్చి, చిల్లర కోసం తడుముతూ అడిగాను.

"ఏమక్కర్లేదు సార్ ! సరిపోయింది" - హుషారుగా అంటూ స్టైల్‌గా ముందుకు కదిలాడు. "ఆఁ ! ఎక్కడ పెద్దన్నా!" అని మరో ప్రయాణికుడ్ని హుషారుగా పలకరిస్తూ.

చాలా అరుదైన మనిషిలా ఉన్నాడు. సిటీలో కూడా రూట్ నెంబర్ 'టూ' లో (2లో) అప్పుడప్పుడూ ఓ కండక్టరు తారసపడ్తుంటాడు. ఆ మహానుభావుడు అన్నంతో పాటు నీళ్ళే తాగుతాడో, 'హ్యూమరసం' తాగుతాడో గాని ఎంతో జాలీగా కనిపిస్తాడు. అతని వ్యవహార శైలీ అందరినీ ఆకట్టుకుంటుంది. ఒక్కసారి అతడ్ని చూసిన వారెప్పుడూ అతడ్ని మరవలేరు.

"చిరంజీవీ...! బాలకృష్ణా....! నాగార్జునా...! పవన్ కళ్యాణ్....! అంటూ క్షణానికో సారి క్రేజీ హీరోల పేర్లతో డ్రైవర్ని మందలిస్తూ, ప్యాసెంజర్లందరినీ తమాషాగా పలకరిస్తూంటాడు.

బస్‌పాస్‌లకి 'ఫెయిల'నే మాటని జోడిస్తూ, కితకితలు పెడ్తాడు. 'ప్యాసెంజర్స్ ఫుల్! కలెక్షన్ నిల్! అంటూ ఛలోక్తులు విసురుతాడు. ముఖ్య విషయమేమిటంటే, ఎక్కడా తన హద్దులు దాటకుండా ప్రవర్తిస్తాడు. ఇలాంటి వాళ్ళవల్లే వృత్తికి గౌరవమూ, గుర్తింపూ పెరుగుతాయి నిజంగా.

కండక్టరు అలా ముందుకెళ్ళిన తర్వాత, ఎందుకో అనుమానం వచ్చి టికెట్స్ పరిశీలించి, అమౌంట్ కౌంట్ చేశాను. రెండు రూపాయలు ఎక్కువవుతోంది. రెండు ఇరవై రూపాయల టికెట్లు. ఒక ఎనిమిది, ఒక నాలుగు..... వెరసి యాభై రెండు!! లెక్కల్లో నేను కొంచెం వీక్. పైగా కండక్టర్ ప్రొఫెషనలిజాన్ని అనుమానించడం.... మళ్ళీ రెండుసార్లు లెక్క చేసుకున్నాక నమ్మకం కుదిరింది.

టిక్కెట్లివ్వడం పూర్తిచేసిన కండక్టరు తన సీట్లో సెటిలవుతూ చేతిలోని 'పంచ్'తో పక్కనున్న బార్‌మీద టకటకలాడించాడు. రౌతు హెచ్చరికతో పరుగందుకున్న గుఱ్ఱంలా బస్సు వేగాన్ని పెంచేసింది.

"హలో ! కండక్టరు గారూ! రెండు రూపాయలివ్వాలి కదండీ!" బస్సు హోరును చీల్చే ప్రయత్నంలో శృతి పెంచాన్నేను.

"వ్వాట్! నేనా?" నమ్మలేనట్టు అతడు.

"కాద్సార్, నేనే ఇవ్వాలి!" నవ్వుతూ నేను.

"ఏదీ టికెట్లవ్వండి ఓ సారి!"

ఓటమిని తేలికగా అంగీకరించని మనస్తత్వం గాబోలు అతనిది.

ఒకటికి రెండుసార్లు లెక్కపెట్టాడు.

"ఓహ్! షిట్!" తల పై సుతారంగా కొట్టుకుంటూ, "కరెక్టే. రెండు రూపాయలివ్వండి సార్!" చేయి సాచాడు నా వైపు.

అప్పటిదాకా జేబులో గోల చేస్తున్న చిల్లరకోసం చేయి పెట్టి తడిమాను. శూన్యంగా ఉన్న ప్యాంటు జేబు నా మతి మరుపును మరోసారి బట్టబయలు చేసింది.

బస్ జర్నీలో చిల్లర ఉంచుకోవడం నాకలవాటు. ఎందుకంటే చిల్లరకోసం చీటీల (టికెట్ల) మీద గీతలు గీసి ప్రయాణీకుల మతి మరుపును క్యాష్ చేసుకునే కండక్టర్‌లను చూస్తున్నాం కదా! దురదృష్టవశాత్తూ కండక్టరు చెప్పిన లెక్క (రూ.50/-) ననుసరించి, పై చిల్లర అవసరం లేదుగదా అని మా ఆవిడకిచ్చేశాను. మరుక్షణం ఆవిడ పల్లీలమ్మేవాడి గల్లాలోకి చేరేందుకు వాటికి రెక్కలు తొడిగింది.

"ఛ!" నన్ను నేను తిట్టుకున్నాను.

"ఏం సార్! లేదా?" - పర్లేదులే అన్న ధోరణి - కండక్టర్.

ఆ సానుభూతి నాకు మింగుడు పళ్ళేదు. నా నిజాయితీకి ఏదో చెరిపేయలేని మకిలం అంటిన ఫీలింగ్.

"నో ప్రోబ్లెమ్! మీరే చిల్లరివ్వండి!" ఠక్కున యాభై నోటు అతనికిచ్చాను.

ఎగాదిగా చూశాడు. ఏమనుకున్నాడో.... అది తీసి తన క్యాష్ బ్యాగ్‌లోకి నొక్కేశాడు.

నిజంగానే 'నొక్కేస్తాడా?' అనిపించిందొక్క క్షణం.

"ఇచ్చేస్తాను సార్!" నా మనసులోని భావాన్ని గ్రహించినట్టు అన్నాడు. - "దిగే ముందు గుర్తుచేయండి" క్యాజువల్‌గా అతను.

ఏమీ అనలేని నిస్సహాయతలో నేను.

ఇవేమీ తనకు సంబంధించినవి కావన్నట్టు పల్లీలు నముల్తూ కిటికీ గుండా నగర సందర్శనం చేస్తోంది శ్రీమతి - మొదటిసారిగా హైదరాబాద్ చూస్తున్నట్టు.

వికారాబాద్‌లో బస్సు దిగి, ఆదరాబాదరాగా మా ఊరికెళ్ళే బస్సు క్యాచ్ చేసి, ఇల్లు చేరుకున్న తర్వాత గానీ కండక్టరు చేతిలో ఇరుక్కున్న నలభై ఎనిమిది రూపాయలు గుర్తుకు రాలేదు. ఏం చేస్తాం? అప్పటికే చేతులు కాలాయి.

0-0-0

ఈసారి సెలవులు ఎప్పటిలా ఆనందం పంచిపెట్టలేక పోయాయి. ప్రతిక్షణం బస్సులో పనిగట్టుకొని నేను మోసపోయిన వైనం. మయసభలో పరాభవం పొందిన దుర్యోధనుని స్థితినే గుర్తుకు తెస్తోంది.

'మరిచెను పో... లెక్కించితిని పో... గుర్తుచేసితిని పో... ఇచ్చితిని పో...' అంటూ ఆ సంఘటనలోని ప్రతికోణం శిలీ ముఖం లా మెత్తని నాగుండె గట్టిదనాన్ని పరీక్షిస్తుంటే - ఎక్కడి ఆనందం?

నన్ను పట్టించుకోకుండా కదిలిపోయిన కాలాన్ని అసహనంగా చూస్తూ తిరుగుముఖం పట్టాను శ్రీమతి తో కూడా.

వికారాబాద్ బస్ స్టేషన్‌లో అడుగుపెడ్తూనే కంట్రోలర్‌తో కలిసి, జరిగిన విషయం చెబితే బావుంటుందనిపించింది. అంతలోనే కనీసం టికెట్‌పైన రాయించుకున్న ఎవిడెన్స్ కూడా లేకుండా ఆ ప్రయత్నం చేయడం ఎంత ఫూలిష్‌గా ఉంటుందోనన్న అనుమానం నన్ను ఊగిసలాటలో పడేసింది.

"ఏం నలభై ఎనిమిది రూపాయలు తేరగా వచ్చాయా? పండ్లూ, కూరగాయలూ అమ్ముకునే వాళ్ళ దగ్గర పైసా పైసాకి గిచ్చి గిచ్చి బేరం చేస్తాం. ఇలాంటి సైలెన్స్‌డ్ దోపిడీలను మాత్రం ఉపేక్షిస్తాం. నో! వదిలేయకూడదు!" - మనసు తిరగబడింది.

కరెక్టే! వివరాలు చెప్పి, ఓ ప్రయత్నం చేయడంలో తప్పులేదు. మన నష్టాన్ని పూడ్చుకోలేకపోయినా ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని సంస్థ దృష్టిలోకి తెచ్చి, సాటివారి కష్టాలను కొంతవరకైనా తొలగించడంలో పాలుపంచుకున్నట్టుంటుంది.

'ఏమో! లెక్కల్లో తేడా వచ్చిందని ఎంక్వయిరీ చేస్తే... ఆ కండక్టరు పట్టుబడితే... ! ఏ ఆర్‌టిసి బిల్డింగ్ పై నుంచో దూకి....' సడన్‌గా నా కాళ్ళకు బ్రేకులు పడ్డాయి.

'బొమ్మా-బొరుసులా ప్రతి పనికీ మంచీ-చెడు అనే రెండు ఫలితాలుంటాయి. మన ఉద్దేశ్యం మంచిదైతే, ఫలితమూ బావుంటుంది.'

మానసిక సంఘర్షణని అతికష్టం మీద అధిగమిస్తూ కంట్రోలర్ రూం వైపు అడుగులేశాను.

ఇంతలో....

హైదరాబాద్ వెళ్ళాల్సిన బస్సు ఒకట్రో నెంబరు ప్లాట్‌ఫాం మీదికి వచ్చి, 'వచ్చేశానోచ్' అన్నట్టు 'కీచు' మంది.

అంతే - నీటిలో అక్కడక్కడ తిరుగాడుతున్న చేప పిల్లలు నీటిలో ఏదో ఎరపడగానే సడన్‌గా అక్కడికి చేరినట్లు ప్రయాణీకులంతా బస్సు చుట్టూ ఎగబడ్డారు. అందులో నేనూ ఓ



చేప పిల్లనే గదా!

'రిజర్వేషన్‌కోటా'లో మా ఆవిడ సీటు దక్కించుకోగలిగింది. నేను మాత్రం (నా కాళ్ళమీద మాత్రమే) నిలబడక తప్పలేదు.

సగటు ప్రయాణికుడి ఆలోచనలు నన్ను కుదిపేయసాగాయి. బస్సు వచ్చేదాకా... త్వరగా వస్తే బాగుండునని, వచ్చాక ఎక్కే అవకాశముంటే చాలని, ఎక్కాక సీటు దొరికితే బాగుండునని, దొరికాక విండో సీటైతే అనుకూలంగా ఉండేదని, సెటిలయ్యాక కదిలితే బాగుండునని....

నిలుచున్న చోటు నుండే కూర్చునే అవకాశాలను కళ్లతోనే సర్వే చేస్తున్నాను. ఎక్కడా అవకాశమున్న దాఖలాల్లేవు. నిట్టూరుస్తూ, 'బస్సెప్పుడు స్టార్టవుతుందిరా దేవుడా!' అనుకున్నా. నా మొర త్వరగానే ఆలకించినట్టున్నాడా పై వాడు. మెల్లగా కదిలింది బస్సు.

రివర్స్ గేర్‌లో పదడుగులు వెనక్కెళ్ళి, మళ్ళీ గేరు మారి ముందుకు కదుల్తూ సడెన్‌గా ఆగిపోయింది.

ఇద్దరు శాల్తీలు బస్సెక్కారు. అందులో ఒకతను వైట్ సఫారీలో ఉన్నాడు. అతను కంట్రోలర్‌గాబోలు అతని వెంటనే మరోగతను. ప్రయాణీకుడేమో! మనిషి మాత్రం చాలా

స్ట్రాంగ్‌గా ఉన్నాడు. మొహం కంటే ముందు, మూడొంతులు ఆక్రమించిన మీసాలే కనిపిస్తున్నాయి.

కంట్రోలర్‌లాంటి మనిషి మిగతా వాళ్ళని తోసుకుంటూ నా దగ్గరికొచ్చి ఎగాదిగా చూశాడు. అతని చేతిలో ఓ కాగితముంది. దాన్నీ, నన్నూ మార్చి మార్చి చూశాడు.

"హలోసార్! మీ పేరేంటి?" ఆ సంబోధనలో మర్యాదకంటే, ఇంటరాగేషన్ ధ్వనిస్తోంది.

'ఎందుకు?' అని అడగలేకపోయాను. సగం జంకు, సగం అనుమానంతో నా పేరు చెప్పాను.

డ్రైవర్ బస్సు ఆపేశాడు.

చాలా మంది ఏదో సినిమా షూటింగ్ చూస్తున్నంత ఆసక్తిగా మమ్మల్నే గమనిస్తున్నారు. మరికొంత మంది లోలోపలే విసుక్కుంటున్నారు. ఇవేమీ పట్టించుకోకుండా అతను ఇంటర్వ్యూ (ఇంటరాగేషన్) సాగించాడు.

తేదీ, సమయం, హైదరాబాద్‌లో బస్సెక్కడం, మధ్యలో చేవెళ్ళలో దిగడం.... వగైరా... మొదట నేను జవాబు చెప్పడానికి తటపటాయించాను. కండెక్టరు వెనుక వచ్చిన మీసాలోడు - "చెప్పరాదువయా?" అంటూ గొంతు సవరించుకోవడంతో, క్లాసురూంలో టీచరు ప్రశ్నలకి ఫస్టు ర్యాంకు స్టూడెంట్‌లా చకచకా జవాబులు చెప్పాను.

"ఒ.కే. సార్! అయితే ఓ రెండు రూపాయలివ్వండి!" - ఏదో కన్‌ఫమ్ అయినట్టు అన్నాడు కంట్రోలర్. ఇప్పుడు కొంచెం మర్యాద కనిపిస్తోంది.

"ఎందుకూ?" ఈ ఇంటర్వ్యూకి, రెండు రూపాయలకే ఉన్న బాదరాయణ సంబంధమేమిటో అర్థంగాక, అడగకుండా, ఉండలేకపోయాను.

"అబ్బ, ఇవ్వరాదు సార్!" విసుక్కున్నాడు పక్కనున్న శాస్త్రీ.

జరగబోయేది ఊహించలేక జేబులోని చిల్లరలోనుంచి రెండు రూపాయలు కాయిన్ తీసి ఇచ్చాను.

వెంటనే అతడు తన జేబులో నుండి యాభై రూపాయల నోటు తీసి, నా చేతిలో పెట్టాడు.

ఒక్క క్షణం నాకేమీ అర్థం కాలేదు.

నా సంగతి అతనికి అర్థమయినట్టుంది.

"వారం రోజుల కింద మీరు 6572 నెంబరు బస్సులో హైదరాబాద్ నుండి వికారాబాద్ వస్తూ, కండక్టరుకు రెండు రూపాయలు ఇవ్వాల్సి ఉంటే చిల్లర లేక యాభై ఇచ్చారు.... అవునా?"

తలూపాను నేను.

"ఆ కండక్టరు పేరు ప్రకాశ్. మీరు వచ్చి పై వివరాలు చెప్పగలిగితే ఇవ్వమని 48 రూపాయలు ఇచ్చి వెళ్ళాడు. అతను హెచ్2 డిపోలో పనిచేస్తాడు. మంచి ఆర్టిస్ట్ కూడా. మీ బొమ్మ గీసిచ్చాడు" - చేతిలోని కాగితాన్నిచ్చాడు.

అచ్చంగా లేకున్నా, పోలికలు స్పష్టంగా ఉన్నాయి. చేయి తిరిగినవాడే !

"అనుకోకుండా ఓ నిముషం క్రితం మా సెల్ ముందు మిమ్మల్ని చూశాను. అంతలోనే కనబడకుండా పోయారు. ఈ బస్సులో ఉండొచ్చని ఎక్స్‌పెక్ట్ చేశాను. నా అంచనా నిజమైంది. సారీ ఫర్ ద ట్రబుల్! విష్ యూ హ్యాపీ జర్నీ!" అన్నాడు.

నా 'థాంక్స్' అందుకొని కరచాలనం చేసి బస్సు దిగిపోయాడు.

ఆ ప్రకాశెవరో గాని వృత్తికీ, మానవ ప్రవృత్తికి ప్రకాశమానంగా నిలిచాడనిపించింది. అంతసేపూ అనుభవించిన క్షోభ, అప్పుడనుభవిస్తున్న శారీక ఇబ్బందీ 'హుష్‌కాకి' అయ్యాయి. కృతజ్ఞత నిండిన మనసుతో ఆ కండక్టరు హా(ఆ)ర్టుకి జోహారులర్పించాను.

బస్సు కదిలింది హుషారుగా. ❖

(జూన్ 2004- రచన ఇంటింటి పత్రిక)